క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సంబేపల్లి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బుధవారం ఎంపీడీఓ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు హాజరుకావాలని కోరారు.

31న పుల్లంపేటలో..

పుల్లంపేట : ఈనెల 31వ తేదీ సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండలాధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సస్యరక్షణ చర్యలతో దిగుబడి

రైల్వేకోడూరు అర్బన్ : పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే మంచి దిగుబడులు వస్తాయని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త శ్రీధర్ తెలిపారు. బుధవారం ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆర్బీకే సిబ్బంది, రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మామిడిలో కొమ్మ కత్తిరింపు, ఎరువుల యాజమాన్యం, బొప్పాయిలో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులు, అరటిలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, హెచ్ఓ భాస్కర్, ఆత్మా బీటీఎం బాలసుబ్రమణ్యం, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న ప్రజలు

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వెంగమరాజుపోడు సమీపంలోని రామాలమ్మ క్షేత్రంలో బుధవారం శత చండీ యాగాన్ని వేద పండితులు వైభవంగా ప్రారంభించారు. యాగం మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. సుగంధ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, పసుపుకొమ్ములు, పిండివంటలతో పూజలు చేసి హోమం నిర్వహించారు. దేవతలను ప్రత్యేక పూలతో అలంకరించి అభిషేకాలు చేశారు. మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ముప్పాల హేమనవర్మ తెలిపారు. వ్యవసాయ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ప్రముఖ అడ్వకేట్ వెంకట్రామరాజు, వీపీఆర్ కండ్రిగ సొసైటీ చైర్మన్ సుదర్శన్‌రాజు, కంపరాజు నాగేంద్రరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దేవనాథరెడ్డి

చిన్నమండెం : ఉచిత వైద్య శిబిరాలను సమీప ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సచివాలయ సమీపంలో బుధవారం అన్నపూర్ణ మల్టీస్పెషలిటీ హాస్పిటల్ వారు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని దేవనాథరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 152 మందికి అన్ని రకాల పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అన్నపూర్ణ రెడ్డి, మహేశ్వరరెడ్డి, సర్పంచులు ముసల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, నజీర్‌అహమ్మద్, అఫ్రోజ్, ఎంపీటీసీలు ఏజాస్‌అలీఖాన్, శ్యామ్‌చంద్ర, గౌస్‌సాబు, అంజనప్ప, జయశంకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా సుజాత



రాజంపేట : రాజంపేట పట్టణ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలిగా ఎల్.సుజాత నియమితులయ్యారు. బుధవారం ఆమె మేడా భవన్‌లో ఎమ్మెల్యే మేడాని కలిసి కృతజ్ఞతలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం ఉంటుందన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలో 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం ఆర్టీసీ నల్లగుట్టలో దాడులు నిర్వహించారు. నల్లగుట్టకు చెందిన పి. వెంకటరమణ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదే ప్రాంతానికి భూదేవిపై కూడా కేసు నమోదు చెసినట్లు చెప్పారు.

నేటి నుంచి అథ్లెటిక్స్ మీట్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురు, శుక్రవారాల్లో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్ , ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. గురువారం మొదటి రోజు జరిగే కార్యక్రమాన్ని ఆర్డీవో ఎం.ఎస్.మురళి పాల్గొంటారన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



రాజంపేట: పీర్ల చావడిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాజంపేట రూరల్: వేడుకలలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మురళీరెడ్డి



చిట్వేలి: పీర్లను గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట : మానవ హక్కుల కోసం చేసిన పోరాటానికి గుర్తుగా మనం మొహర్రం వేడుకలను జరుపుకుంటున్నామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం రాజంపేట పట్టణం నాగులమానువీధిలో మొహర్రం ఉత్సవ వేడుకలలో ఏడురోజులో భాగంగా చావిడిలో పీర్లను దర్శించుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం పండుగను ముస్లింలే కాకుండా అన్ని వర్గాల ప్రజలు జరుపుకొనే సంప్రదాయం వందల ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. మొహర్రం అమరవీరుల త్యాగాల దినమన్నారు. మహ్మద్ ప్రవక్త మనవడు ఇమాం త్యాగానికి చిహ్నమన్నారు. మహ్మద్ ప్రవక్త పాలితులు ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలని జనమంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఒక రకంగా మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీఆర్‌డీసీ స్టేట్ డైరక్టరు గండికోట గుల్జార్‌బాషా, రిటైర్డు ఫిజికల్ డైరక్టరు షామీర్‌బాషా, కౌన్సిలర్ నవీన్‌శెట్టి, మైనార్టీ నాయకులు ఖాజామోహిద్దీన్, కాలేషా, మున్నా, రహంతుల్లా, ఇమ్రాన్, సల్మాన్, హమీద్, ఆరీఫ్, స్థానిక నేతలు రాజేష్, అవినాష్, సుబ్బరాయుడు, సుధీర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీ పెద్దూరులో బుధవారం ఘనంగా పీర్ల పండుగను నిర్వహించారు. పీర్ల చావడిని ప్రత్యేకంగా అలంకరించారు. పీర్లకు బాసీకాలను తొడిగి, చదివింపులు అందజేశారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి, ఆయన సోదరుడు ఆకేపాటి మురళీరెడ్డిలకు కార్యనిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు పీర్లకు బాసీకాలను అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : త్యాగానికి ప్రతీకైన మొహర్రం వేడుకలు చిట్వేలి మండలంలో భక్తిశ్రద్ధలతో మొదలయ్యాయి. పదిరోజులపాటు నిర్వహించే ఈ వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పీర్లచావడి, రహదారి మొత్తం విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. బుధవారం పీర్లను మేళతాళాల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అడుగడుగునా పీర్లకు చదివింపులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

28న జూనియర్ కళాశాలల బంద్

రాయచోటి అర్బన్ : జూనియర్ కళాశాలల విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న నిర్వహింప తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి కోరారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన విద్యార్థినులతో కలసి బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఫీజు దోపిడీ చేస్తున్న కళాశాలలపై చర్యలు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలంటూ డిమాండ్ చేశారు.

విద్యార్థులకు చదువే గొప్ప ఆస్తి

వీరబల్లె (రాయచోటిటౌన్) : విద్యార్థులకు చదువే గొప్ప ఆస్తిని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్‌రెడ్డి (మదన్‌రెడ్డి) అన్నారు. బుధవారం మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు డివి సత్యకుమార్ తన సొంత నిధులు రూ.40 వేలతో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విజయసాగర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువు చాలా గొప్ప ఆస్తిగా నిలుస్తుందన్నారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, సంజీవరెడ్డి, హరినాథరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు

రాయచోటి అర్బన్ : పట్టణంలో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా ఆరోపించారు. బుధవారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రూ.17కోట్లతో పట్టణంలో నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రోడ్ల విస్తరణలో కొంత మేర ఇళ్ల నిర్మాణాలను ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరిస్తున్నామన్నారు. ఇప్పటికే మార్కింగ్ ఇచ్చామని కట్టడాల తొలగింపు ప్రక్రియను పోలీసులు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి భవిష్యత్తు ఎక్కడ ఉండదోనన్న భయం టిడిపి నేతలకు పట్టుకుందన్నారు. టిడిపి నేతలు రెచ్చగొట్టే ఆరోపణలను మానుకుని ఇళ్ల తొలగింపు ప్రక్రియలో అన్యాయం జరిగినట్లు నిరూపిస్తే తాము దేనికైనా సిద్ధమంటూ ఆయన సవాల్ విసిరారు.

అభివృద్ధిని అడ్డుకోవడం విచారకరం

రాయచోటి టౌన్ : గతంలో ఎన్నడూ లేని విధంగా రాయచోటి అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని మదనపల్లె వైఎస్సార్‌సీపీ పరిశీలకులు హబీబ్‌ఖాన్ అన్నారు. అలాంటిది అభివృద్ధిని అడ్డుకోవడం కోసం లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అడ్డుకోవాలనే ప్రయత్నిండచం విచారకరమని ఆయన తెలిపారు. బుధవారం రాయచోటిలోని తన స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న రోడ్ల విస్తరణలో రోడ్డుకిరువైపులా ఇళ్లను తొలగిస్తున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి ఇంటి యజమానులు ఎలాంటి ఫిర్యాదులు చేయకపోయినా అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఆయన ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి పనులు చేయడం బాధకరమన్నారు. కౌన్సిలర్‌లు గౌస్‌ఖాన్, ఇర్షాద్, అల్తాఫ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తెలుగు, గణితం, ఆంగ్లం, భౌతిక శాస్త్రం, సాంఘికం, హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంగ్ల రీసోర్స్ పర్సన్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఇంటరాక్టివ్ ప్యానెల్ వినియోగం, డిజిటలైజేన్ ద్వారా ఏ విధంగా బోధించాలి, సృజనాత్మకతను ఎలా పెంపొందించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విష్ణురెడ్డి తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : విద్యుత్ ఘాతంతో 50శాతం శరీరం కాలిపోయిన తమ్మిరెడ్డి విష్ణురెడ్డికి ఓబులవారిపల్లె మండల యూత్, దాతలు, సర్పంచ్ జయపాల్ రెడ్డిలు బుధవారం తిరుపతిలో చికిత్స పొందుతున్న విష్ణురెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డికి ఆర్థిక సహాయం అందించారు. విష్ణురెడ్డి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో ఓబులవారిపల్లెకి చెందిన యువత రూ. 2,36,680లు సేకరించి విష్ణురెడ్డి కుటుంబానికి అందించగా సర్పంచ్ జయపాల్ రెడ్డి రూ. 10 వేలు, నూకా సుదర్శన్ రెడ్డి, నూకా మన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ. 90 వేలు అందజేశారు.

చిట్వేలి : ఓబులవారిపల్లె మండలంలో విద్యుత్ ఘాతానికి గురై వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ సభ్యులు రూ.72 వేలు ఆర్థిక సహాయం అందించారు. సీహెచ్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్ వాట్సప్ ద్వారా దాతల నుంచి రూ.72 వేలు సేకరించి బుధవారం బాధితుడి తండ్రి శ్రీనుకు ఓబులవారిపల్లెలో అందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

గాలివీడు : గాలివీటి గంగమ్మ ఆలయ అభివృద్ధికి వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి భాస్కర్‌రెడ్డి కుమారుడు మదన్‌మోహన్‌రెడ్డి రూ.5లక్షలు విరాళంగా అందించారు. బుధవారం తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదు మొత్తాన్ని అందజేశారు. తమ ఇంటి ఇలవేల్పుగా ఉన్న గాలివీటి గంగమ్మకు ప్రతి ఏటా ఆనవాయితీగా పట్టువస్త్రాలు సమర్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఆలయానికి మెరుగులు దిద్దే క్రమంలో మరింత సహకారం అందిస్తామన్నారు. హేమకుమార్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మహేష్‌బాబు, పూజారి సంపత్, బేబి కుమార్, శివ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ జాతర



పథకాలపై ఆరా తీస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

– గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం చిన్నఓరంపాడు సచివాలయ పరిధిలోని అయ్యలరాజుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, నాయకులు, అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. విద్యుత్‌కు సంబంధించి రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్, గృహాలు గురించి తదితర సమస్యలను ప్రజలు కొరముట్ల దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీలను చెప్పనటువంటి వాటిని కూడా అమలు చేశారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ జాతర జరుగుతుందని, ప్రతి ఇంటికీ ఏదో విధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పథకాలు అందక ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఎన్నికలలో చంద్రబాబు నాయుడు అమలు చేయడానికి వీలుకానటువంటి వంద అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలకు వెన్నుపోటు పొడించారని పేర్కొన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎంపీపీ చీర్ల నాగమ్మ, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టంగుటూరి కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంపా బాలిరెడ్డి, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సర్పంచ్ నారాయణ రెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి, పిచ్చన్న, గుండాల్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, బీఆర్ ప్రేమ్, చింతు దుర్గారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, తహసీల్దార్ ఫుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ



దిన్నెపాడులో ఓట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్‌ను చేయాలని తహసీల్దార్ ఉదయ్‌కుమార్ రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిన్నెపాడు గ్రామంలో ఆర్ఐ సమ్మద్ ఖాన్, వీఆర్ఓ ప్రసాద్‌లు ఓట్ల వెరిఫికేషన్ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లతో కలసి పాల్గొన్నారు. ప్రతి ఓటును ధృవీకరించి ఆధార్ కార్డుతో సరిచూడాలని బీఎల్‌ఓలకు, క్లస్టర్ ఇన్‌చార్జ్, కన్వీనర్లకు సూచనలు ఇచ్చారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ సూచించారు. బీఎల్ఓ వెంట వలంటీర్లు ఉండరాదని సూచించారు. గ్రామస్తులు గంగిరెడ్డి, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేను తనిఖీ చేసిన అధికారులు

పెనగలూరు : మండల కేంద్రంలో ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీధర్ రావు బుధవారం తనిఖీ చేశారు. పెనగలూరు గ్రామంలో ఓటరు జాబితా తీసుకొని ఆ కుటుంబంలో ఉన్న ఓటర్ల సంఖ్య గురించి ఆరాతీశారు. అలాగే ఒక్కో కుటుంబంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, వీరిలో వివాహమైన వారు ఎంతమంది, మృతి చెందినవారి జాబితాను పరిశీలించారు. అక్కడ సర్వే చేసే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రత్యేక అధికారి భాస్కర్, వీఆర్ఓ కుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఈ- పంటపై అవగాహన కల్పించండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారి రమేష్

పెనగలూరు : మండలంలో ఈ – పంటపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ సంచాలకులు రమేష్ తెలిపారు. బుధవారం పెనగలూరు రైతు భరోసా కేంద్రంలో వీఆర్ఓలు, ఆర్బీకేల సిబ్బందికి ఈ–పంటపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పండించిన పంటను మిస్ కాకుండా ఈ–పంటలో నమోదు చేయాలన్నారు. ఈ–పంట ఆధారంగా సున్నా వడ్డీ రుణాలు, సబ్సిడీలు, నష్ట పరిహారం అనేక రకాల పథకాలు అందుతాయని చెప్పారు. ప్రతి రైతుకు ఈ–పంటపై అవగాహన కలిగించాలన్నారు. అంతకుముందు తహసీల్దార్ శ్రీధర్ రావు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల వ్యవసాయశాఖ అధికారి పవన్, ఏఎస్ఓ దామోదర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రామాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో అంటువ్యాధులపై సర్వే కూడా నిర్వహించామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 150కి పైగా రోగులు వస్తున్నారని తెలిపారు. వైరల్ ఫీవర్స్ తోపాటు ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వ్యాధుల లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్య అధికారిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కాచిన నీటిని తాగడం మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడలని సూచించారు. ఇంటి పరసరాల వద్ద మురికినీటి గుంటలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని, మురికిగుంతల్లో, డ్రైనేజీలలో బ్లీచింగ్ పిచికారీ చేయాలని ఆయన తెలియజేశారు.

కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళి



చిట్వేలి: యుద్ధ వీరులకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండల కేంద్రంలోని శ్రీ భారతీ హైస్కూల్‌లో బుధవారం కార్గిల్ విజయ్ దినోత్సవం సందర్భంగా కార్గిల్ యుద్ధంలో మరణించిన వీర సైనికులకు ఘనంగా నివాళులర్పించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముక్కర నిర్మలాదేవి తెలిపారు. అనంతరం యుద్ధవీరులను స్మరిస్తూ కార్గిల్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణ, దేశభక్తి, ధైర్యసాహసాలను పెంపొందించుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ 1999 జూలై 26న భారత సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించినందుకు గుర్తుగా కార్గిల్ విజయ దివాస్‌ను జరుపుకుంటామని ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. కార్గిల్ విద్య దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమర జవాన్లకు నివాళులర్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కృష్ణారెడ్డి, అధ్యాపకులు సహదేవరెడ్డి, సుందరరావు, శాంతయ్య, కల్యాణి, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు అందించండి

పెనగలూరు : పశువులకు కచ్చితంగా వైద్య సేవలు అందించాలని వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండూరు పంచాయతీలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొండూరులో పశువులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రైతులు ఫిర్యాదు చేశారని, ఇకపై అలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలియజేశారు. అనంతరం చిట్వేలి ప్రాంతీయ పశు వైద్య అధికారి కే.డీ ప్రసాద్ మాట్లాడుతూ ఇకపై సిబ్బందితో ఎప్పటికప్పుడు పశువులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అక్సన్‌వెడ్ మందులు పంపిణీ కడప వారి సౌజన్యంతో కావాల్సిన వారికి ఉచితంగా అందజేశారు. పెనగలూరు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, కాకర్లవారిపల్లి పశువైద్యురాలు డాక్టర్ వేదవతి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి, పశు ఆరోగ్య సేవా సిబ్బంది డాక్టర్ కృషిక్, ఇమామ్, నరేంద్ర, సతీష్, గోపాలమిత్ర పెంచలయ్య బృందం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 16వ తేదీ నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్రను చేపడుతున్నామన్నారు. విశాఖపట్నం ఉక్కు కార్మాగారం మెయిన్ గేట్ నుంచి ప్రారంభమయ్యే యాత్ర సెప్టెంబరు 5న అన్నమయ్య జిల్లాకు చేరుకొని 6న తిరుపతిలో ముగుస్తుందన్నారు. అన్నమయ్య జిల్లాలో జరిగే యాత్రను విజయవంతం చేయాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి



లక్కిరెడ్డిపల్లె: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ చక్రేనాయక్

లక్కిరెడ్డిపల్లె : బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ వెంకటరమణా రెడ్డి, ఎంఈఓ చక్రేనాయక్‌లు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారు పర్యటించి ఐదు నుంచి పది సంవత్సరాల వయస్సు పిల్లలు బడి బయట కాకుండా బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఆదేశానుసారం ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు.

డ్రాప్ ఔట్స్ లేకుండా చూద్దాం : మండల ప్రత్యేక అధికారి పి.రాజశేఖరరెడ్డి

రాయచోటి అర్బన్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా బడి ఈడు పిల్లలు బడి బయట లేకుండా చేద్దామని మండల ప్రత్యేక అధికారి పి.రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండల పరిధిలోని మాధవరం గ్రామ సచివాలయం – 2 ఉద్యోగులతో ఆయన సమావేశమమై పాఠశాలలో డ్రాప్ ఔట్లపై సమీక్షించారు. బడి ఈడు పిల్లలు ఎందుకు పాఠశాలలకు ఎందుకు వెళ్లడం లేదో ఆరా తీశారు. పాత సైకంవాండ్లపల్లె నుంచి మాధవరానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడం, గతంలో ఉన్న బస్సు సర్వీసును నిలిపివేయడంతో విద్యార్థినుల భద్రత దృష్ట్యా పాఠశాలలకు పంపలేకపోతున్నట్లు తల్లితండ్రులు చెబుతున్నారంటూ మండల ప్రత్యేకాధికారికి సచివాలయ సిబ్బంది వివరించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ రోడ్డు నిర్మాణం, బస్సు సౌకర్యం కల్పనల విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామంటూ తెలిపారు. బడి ఈడు పిల్లలంతా కచ్చితంగా పాఠశాలలకు వెళ్లేలా చూడాలంటూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ పీహెచ్‌సీ కో – ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, సచివాలయం కార్యదర్శి షేక్ సహ జియా సుల్తానా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

పుల్లంపేట : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఎంపీడీఓ రఘురాం, ఎంఈఓ నాగా తిరుమలరావు ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతి పూర్తయిన విద్యార్థులను కళాశాలలో చేర్పించి ప్రభుత్వం నుంచి అదే సదుపాయాలు గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. ఎవరైనా విద్యార్థులు బడి మానివేసి ఉంటే విద్య ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రిన్సిపాల్ బాలాజీ, ఎస్‌బీవీడీ సభా ప్రధానోపాధ్యాయుడు మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : ప్రభుత్వ పాఠశాలతోపాటు కస్తూర్బా, గురుకులం, ఆదర్శ పాఠశాలలో వంద శాతం విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుస్మిత, తహసీల్దార్ అరవింద్ కిషోర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని కస్తూర్బా, ఆదర్శ, గురుకుల పాఠశాలలను వారు తనిఖీ చేశారు. మాట్లాడుతూ ఇంతవరకు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఎంత శాతం జరిగిందని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బడి ఈడు వయస్సు ఉన్న బాలబాలికలు పాఠశాలలోనే ఉండాలన్నారు. జగనన్న గోరుముద్ద, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం సక్రమంగా ఉండాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ ఉండేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్, ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్ర, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.